




సచివాలయంలో ఎంఎల్ఎ తనిఖీ

ప్రజాశక్తి-కందుకూరు : మండలంలోని మాచవరం గ్రామంలో ఉన్న సచివాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఉదయం ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో పనిచేసే సిబ్బంది హాజరును ఎమ్మెల్యే పరిశీలించారు.ప్రజా సమస్యల పై తక్షణమే స్పందించాలని, ప్రజా సంక్షేమమే పరమావధిగా, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే విధంగా ఉద్యోగులు పని చేయాలని, సమయ పాలన విధిగా పాటించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం సచివాల య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ రత్న జ్యోతి ఇతర అధికారులు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి

వక్ఫ్ సవరణ చట్టం ఉపసంహరించుకోవాలి

మాజీ ఎంఎల్సిలు కె.ఎస్ లక్ష్మణరావు, విటపు బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-నెల్లూరు

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ మౌలిక స్వభావానికి, మైనార్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే విధంగా ఉందని, తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా ఉత్తర ప్రదేశం, బీహార్, అస్సాం వంటి ఇతర రాష్ట్రాలలో సైతం ఈ చట్టంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న దరిమలా కేంద్ర ప్రభుత్వం స్పందించి వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని మాజీ ఎంఎల్సిలు కె.ఎస్. లక్ష్మణరావు, విటపు బాలసుబ్రహ్మణ్యంలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నెల్లూరు నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో 'వక్ఫ్ సవరణ చట్టాన్ని' ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలంటూ జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ మాదాల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిధులుగా మాజీ ఎంఎల్సి కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ 1949లో దేశ ప్రజలందరి ప్రయోజనాలను కాపాడే విధంగా రాజ్యాంగ రచన చోటు చేసుకుందన్నారు. అటువంటి రాజ్యాంగానికి మౌలిక స్వరూపం ఉందని, దానిని మార్చే హక్కు ఎవరికీలేదని ఉన్నత న్యాయస్థానం తీర్పును వెల్లడించిందని గుర్తు చేశారు. రాజ్యాంగంలో లౌకిక వాదం గురించి, మైనార్టీల హక్కుల గురించి, ప్రాథమిక హక్కుల ప్రాధాన్యతను వివరించిందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 26ను అనుసరించి మత, ప్రాథమిక ప్రయోజనాల నిమిత్తం సంస్థలను స్థాపించి, నిర్వహించుకోవచ్చున్నారు. అంతే కాకుండా స్థిర చరాస్థులను సైతం కలిగి ఉండవచ్చని పేర్కొందన్నారు. చట్ట ప్రకారం వీటన్నింటి నిర్వహణ కోసం సర్వహక్కులు కలిగి ఉంటారని తెలియజేస్తుందన్నారు. లౌకిక వాదం అంటే మైనార్టీలు అభివృద్ధి చెందేందుకు అవకాశాలు కలిగి ఉండటమే అన్నారు. ప్రజాస్వామ్య దేశాలన్నింటిలోనూ మైనార్టీలు ఉంటారన్నారు. అటువంటి వారి హక్కుల నిమిత్తం ఏర్పడింది వక్ఫ్ అన్నారు. వీటికి కారణమైన చట్టాన్ని 1995లో అమలు చేస్తే కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఆ చట్టాన్ని రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కేంద్రంలో 10 సంవత్సరాల నుంచి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఒక పథకం ప్రకారం ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేందుకు 370 ఆర్టికల్ రద్దు చేయడం, సిఎఎ చట్టాన్ని అమలు చేయడం, బాబ్రీ మసీదు వివాదాన్ని సృష్టించడం వంటివి చేసిందన్నారు. బిజెపి తన రాజకీయ ప్రయోజనాలకోసం మతాలను వాడుకుంటుందన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉత్తర భారత దేశంలో దళితులపై దాడులు జరగడం, మైనార్టీలపై, రక్షణ దళాలపై దాడులు జరగడాన్ని పరిశీలిస్తే దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టే ప్రయత్నమే అన్నారు. మాజీ విటపు బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉర్దు పరాయి బాష కాదన్నారు. అది దేశంలో పుట్టిన భాషే అని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని గుర్తు చేశారు. మతం సాకుతో ఉర్దునే వేరు చేసి చూడటానికి జరుగుతున్న ప్రయత్నాల పట్ల న్యాయస్థానం ఆవేదన వ్యక్తం చేసిందన్నారు. 1995లో వక్ఫ్ చట్టం బోర్డులో ఎవరు సభ్యులుగా ఉండాలో స్పష్టంగా నిర్ధేశించిందన్నారు. దేశ ఐక్యతకు దెబ్బతీసే విధంగా జరుగుతున్న కుట్రలకు వ్యతిరేకంగా దేశ ప్రజానీకం కదలాలని, లౌకిక , ప్రజాతంత్ర , అభ్యుదయశక్తులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ సవరణల ద్వారా ముస్లిముల హక్కులను రద్దు చేయాలన్న ప్రధానమైన ఎజెండాను ముందుకు తీసుకెళ్తున్నట్లు అర్ధమవుతుందన్నారు. పౌరసత్వ సవరణ చట్టం సిఎఎ ప్రత్యేక ఉద్ధేశాన్ని ఇది ప్రతిభింబిస్తోందన్నారు. దేశ లౌకిక, ప్రజా తంత్ర కూర్పును పరిరక్షించుకునేందుకు లౌకికవాదులు, ప్రజాస్వామ్య భావజాలం కలిగిన పౌరులందరూ ఈ విచ్చన్న కరమైన వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హిందువులను, ముస్లిములను విడగొట్టాలన్న ధోరణితో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముస్లిం సమాజాభివృద్ధికి అనేక మంది దాతలు తమ ఆస్తులను దానం చేయగా ఏర్పడి భూములతో వక్ఫ్ బోర్డు ఏర్పడిందన్నారు. ముస్లిం సమాజానికి మేలు చేసేందుకు ఏర్పడిందన్నారు. బిజెపి ప్రభుత్వం వక్ఫ్ బోర్డు నిర్వహణలో ముస్లిమేతరులను చేర్పించి ప్రయత్నం చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఇలియాజ్, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఐ నాయకులు సిరాజ్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసి నాయకులు సాగర్, ఆవాజ్ కమిటీ కార్యదర్శి రషీద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంఎల్సి విటపు బాలసుబ్రమణ్యం , మాజీ ఎంఎల్సి లక్ష్మణ్‌రావు, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా

పరిశ్రమలకు అనుమతులు

అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం

ప్రజాశక్తి -నెల్లూరు

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు జాప్యం లేకుండా సింగిల్ డెస్క్ పోర్టల్ ఏర్పాటు ద్వారా సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తుల పురోగతి, క్లస్టర్ డెవలప్‌మెంటు ప్రోగ్రాం మొదల్కెన అంశాలను జిల్లా పరిశ్రమలశాఖ జిఎం ప్రసాద్ వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటవుతున్న పరిశ్రమలకు సంబంధించి అన్ని అనుమతులను ఆయాశాఖల అధికారులు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా సత్వరమే మంజూరు చేయాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దిష్ట గడువు కంటే ముందుగా అనుమతులు ఇవ్వాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ, మౌలిక వసతుల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో పలు పరిశ్రమలకు సబ్సిడీ ప్రోత్సాహాలను వెంటనే మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని జిఎం, లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను ఆదేశించారు. డీఎఫ్ఓ మహబూబ్ బాషా ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ వెంకటరమణ, డ్వామా పీడీ గంగాభవాని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్ కుమార్, కమిటీ సభ్యులు ఎపికె రెడ్డి, ఒమ్మిన్ సతీష్ కుమార్, ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

భ.ని.కా సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

24న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి -నెల్లూరు : టిడిపి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని, సంక్షేమ పథకాలు నిలివేస్తూ వైసిపి ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 1214ను రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పూలే దంపతుల విగ్రహం సమీపంలోని భవన నిర్మాణ జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు.భ.ని.కా సంఘం నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 24వ తేదిన నిరసన, ధర్నా కార్యక్రమాలు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహిస్తున్నామని, ఈ నేపథ్యంలో నగరంలో నిర్వహించతలపెట్టిన నిరసన ప్రదర్శన, అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమానికి అధిక సంఖ్యలో భవన నిర్మాణ రంగానికి సంబంధించిన కార్మికులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం నిమిత్తం సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని ఎన్నో ఉద్యమాలు , పోరాటాలు చేసి ఒక సమగ్రమైన చట్టాన్ని సాధించుకున్నామన్నారు. ఈచట్టాన్ని అనుసరించి 10 లక్షల నిర్మాణ వ్యయం దాటిన ప్రతి నిర్మాణ యజమాని నుంచి ఒక శాతం చెస్ భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు చెల్లించే విధంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క శాతం చెస్ చోప్పున వసూలు చేసిన తాలుకా నిధులు రూ. 4,298 కోట్లు ఉన్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి శాసన మండలికి తెలియజేశారని గుర్తు చేశారు.. పెండింగ్లో ఉన్న క్లెయిమ్స్ ను వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు. మొత్తం తొమ్మిది డిమాండ్ల మీద ఈనెల 24న ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్లాడి గోపాల్, జిల్లా అధ్యక్షులు ఎస్‌కె ఛాన్‌బాషా, జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ శ్రీని వాసులు, జిల్లా కోశాధికారి ఏ.పెంచలయ్య, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.సంపూర్ణమ్మ, జిల్లా ఆఫీస్ బేరర్స్ జె.చిరంజీవి, జిల్లా కమిటీ సభ్యులు పి.హరి, రూరల్ కమిటీ సభ్యులు ఎస్‌కె నజీర్, రూరల్ అధ్యక్షులు ఎస్‌కె జలీల్, పిట్ల సూర్యనారాయణ ఉన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - వలేటివారిపాలెం : ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మండలంలో గత 15 రోజులుగా జరుగుతున్న జాతీయ పౌష్టిక ఆహార వారోత్సవాల్లో కార్యక్రమాలు మండలంలోని శాకవారం లో మంగళవారంతో ముగిశాయి. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సునీత కార్యకర్తలతో కలిసి పౌష్టికాహారం ప్లే కార్డులతో గ్రామంలో రాలీ నిర్వహించి గర్భవతులకు, బాలింతలకు అవగాహన కల్పించింది.కార్యకర్తలు మమత, రం గమ్మ, పద్మ, టీచరు శ్రీనివాసులు ఉన్నారు.




వలేటివారిపాలెంలో..

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ : గుడ్లూరు మండలంలోని గుడ్లూరు- 2 సెక్టార్‌లోని రాళ్లపాడు గ్రామంలోనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవం కార్యక్రమం జరిగింది. గర్భిణులు, బాలింతలు, తల్లులకు పౌష్టికాహారం ఎలా తీసుకోవాలో వివరించారు. అంగన్వాడి సూపర్వైజర్ కామేశ్వరి. అంగన్వాడి కార్యకర్తలు సి.హెచ్ మీనా . ఏ. గీత . అరుణ శివ లీల. దేవరాజీతం. రాళ్లపాడు ఎంపీపీ స్కూల్ టీచర్స్ .చంద్రశేఖర్ . శ్రీదేవి . కష్ణారెడ్డి. శ్రీహరి ఉన్నారు

28న జాబ్ మేళా

ప్రజాశక్తి-కందుకూరు : ఈనెల 28న ఎపి స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో జరిగే జాబ్ మేళా వాల్ పోస్టర్లను మంగళవారం ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నైపుణ్యాభివద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 28వ తేదీ సోమవారం కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఫాక్స్ కాన్ ప్రైవేట్ లిమిటెడ్, ఆర్ట్రియెస్ట్ టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, టి సి ఎల్, ఎరిస్ ఆగ్రో లిమిటెడ్, హీరో మోటో కార్ప్ లిమిటెడ్, బ్లూ స్టార్ క్లైమాటేక్ లిమిటెడ్, అమర్ రాజా బ్యాటరీస్ తదితర 14 ప్రముఖ కంపెనీల వారు పాల్గొని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. ఏపీ.ఎస్. ఎస్.డి.సి సంస్థ జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం ,ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ షేక్ రియాజుద్దీన్ పర్యవేక్షణలో జరిగే ఈ జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు .వివరాలకు 9848050543, 7989613024 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి..

ప్రజాశక్తి -నెల్లూరు

మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ట్రాన్స్‌పోర్టు రంగ కార్మికులు, ఆటో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు టివివి ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇందుకూరుపేట మండల ఆటో స్టాండ్ సమావేశం నిర్వహించారు. ఆటో కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్య దర్శి కే సురేష్ పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వంకార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలనుకాలరాసే విధంగా 4 లేబర్ కోడలు తీసుకొచ్చిందన్నారు. ఆ లేబర్ కోడ్ల సాయంతో కార్మికులను బలవంతంగా బానిసత్వం లోకి నెట్టబడుతున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆ లేబర్ కోడ్లను క్రార్మికులు వ్యతిరేకించాలన్నారు.వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఇచ్చే విధానాన్ని ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుందని,ఈ ఆలోచన విరమించుకోవాలన్నారు. ఆటో కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు టివివి ప్రసాద్ మాట్లాడుతూ ఆటో కార్మికులు మే డే సందర్భంగా అన్ని స్టాండ్ లో జెండాలు ఎగరేసి మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మారుబోయిన రాజా మాట్లాడుతూ కార్మికుల సమస్యల మీద కార్మికు లందరూ ఐక్యంగా ఉండి పోరాడాలన్నారు. ఆటో యూనియన్ మండల నాయకులు ఎస్‌కె జాన్ బాషా మనోహర్, దయాసాగర్, వాసు శీనయ్య, డీ జే మల్లి ఉన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు టివివి ప్రసాద్

అంగన్‌వాడీ హెల్పర్లపై సాధికార సర్వేలో నమోదు చేసిన అంశాలను తొలగించాలి

ఐసిడిఎస్ రాష్ట్ర డైరెక్టర్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి-కందుకూరు

అంగన్‌వాడీ వర్కర్లపై సాధికార సర్వేలో నమోదు చేసిన ప్రభుత్వ ఉద్యోగి, నెల జీతం 12000 అనే అంశాలను తొలగించాలనికోరుతూ మంగళవారం గుంటూరు సమగ్ర స్త్రీ శిశు సంక్షేమ రాష్ట్ర డైరెక్టర్‌కు సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో, సిఐటియు నెల్లూరు జిల్లా కార్యదర్శి, జి వెంకటేశ్వర్లు, సిఐటియు గుంటూరు జిల్లా అధ్యక్షులు బిలక్ష్మణరావు, ఉలవపాడు ప్రాజెక్టు అంగన్వాడి హెల్పర్లు, కే శైలజ, బి వరలక్ష్మి, ఎస్.కె షాహిన, కె శోభారాణి ఉన్నారు. సిఐటియు నెల్లూరు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ హెల్పర్లకు గౌరవ వేతనం రూ 7000 ఇస్తున్నారని, సాధికార సర్వేలో అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా చూపి నెల జీతం రూ 12000 గా నమోదు చేసిన కారణంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏవీ కూడా వారికి అమలు కావట్లేదన్నారు. దీనివల్ల పధానంగా ఎస్సీ ,ఎస్టీ ,బిసి ,మైనారిటీలకి చెందనవారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. . వెంటనే సాధికార సర్వేలో నమోదు చేసిన అంశాలను తోలిగించాలని కోరారు. దీనిపై స్పందించిన రాష్ట్ర కార్యాలయ అధికారి రత్నాకర్ మాట్లాడుతూ మీ సమస్య చాలా న్యాయం అయింది, అయితే మా కార్యాలయ పరిధిలో బాగానే ఉంది, గ్రామ సచివాలయం వార్డు సచివాలయం లో తప్పుగా నమోదయింది, దీనిని సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పోరాడి సాధించుకున్న హెల్పర్లు

రాష్ట్ర ఐసిడిఎస్ కార్యాలయంలో అర్జీ ఇచ్చిన వెంటనే స్పందించిన రత్నాకర్‌జిఎస్‌డబ్యూ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారం చేశారు. బి వరలక్ష్మి అనే హెల్పర్ కు గతంలో కరెంట్ బిల్లు చెల్లించేది. అర్జీ ఇచ్చిన తక్షణమే ఉచిత కరెంటుకు వెలిజిబుల్ అయ్యింది. వెంటనే స్పందించి సమస్యను పరిష్కారం చేసిన రత్నాకర్ కి సిఐటియు, అంగన్‌వాడీ హెల్పర్లు కతజ్ఞతలు తెలిపారు. కందుకూరు నియోజకవర్గంలో అంగన్‌వాడీల్లో ఎవరికైనా ఎస్సీ ,ఎస్టీలకు ఉచిత కరెంటు అమలు కాకపోయినా, ఉచిత గ్యాస్ , తల్లికి వందనం పడకపోయినా వెంటనే సిఐటియు సహకారంతో సమస్యను పరిష్కరించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు కోరారు.




ఐసిడిఎస్ రాష్ట్ర డైరెక్టర్‌తో చర్చిస్తున్న సిఐటియు నాయకులు


పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు మున్సిపాలిటీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటియుసి, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు రావలసిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, మున్సిపాలిటీలో పెరిగిన జనాభా ప్రాతిపదికన పారిశుద్ధ కార్మికుల సంఖ్య పెంచాలని ,పారిశుద్ధ్య కార్మికులకు కనీస వసతులను సకాలంలో అందించాలని కోరారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులు తక్కువగా ఉన్నందున అన్ని పనులకు వారిని వినియోగిస్తున్నారని దాంతో పారిశుధ్య సమస్య పరిష్కారం కావడంలేదని వారు తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కే అనుషకు వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ ఉమ్మడి ప్రకాశం జిల్లా మాజీ అధ్యక్షులు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి వై.ఆనంద మోహన్, సిఐటియు నాయకులు ఎస్ ఏ గౌస్, ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాకుమాని రవణమ్మ, నాయకులు పులి నాగేశ్వరరావు, మహేంద్ర, వట్టిముక్కల రమణమ్మ ఉన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు,ఎఐటియుసి



వలేటివారిపాలెంలో..

భూసార పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి - వలేటివారిపాలెం : భూసార పరీక్షలతో భవిష్యత్తులో రైతులు వేసుకునే పంటలకు ఎంతో ప్రయోజనకరం అని మండల వ్యవసాయాధికారి ఎం హేమంత్ భరత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కొండసముద్రం గ్రామంలో రైతులకు భూసార పరీక్షల ప్రాముఖ్యత మరియు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి సంబంధించి మండలంలో 735 మట్టి పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈనెల 21 నుండి 30వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాలలోని రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం 2024-25 సంవత్సరంకు సంబంధించి వచ్చిన భూసార పరీక్ష పత్రాలను ఏఓ భరత్ కుమార్ రైతులకు పంపిణీ చేశారు. ఉద్యాన సహాయ కులు ఏ సురేష్, గ్రామ నాయకులు ఘట్టమనేని సుబ్బారావు, నలమోతు రాంబాబు, మన్నం చిరంజీవి, గ్రామ రైతులు నల్లమోతు హరికష్ణ, పిర్ల నారాయణ, నాగినేని వెంకట నరసింహం, నలమోతు కోటయ్య ఉన్నారు.

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్

మండల వ్యవసాయ అధికారి బి రవికుమార్ అధ్యక్షతన గుడ్లూరు మండలంలోని చినలాటరపీ, నాయిడు పాలెం రైతు సేవా కేంద్రం పరిధిలో రైతు సోదరులకు పత్యామ్నాయ పంటలు, మట్టినమూనా పరీక్షల పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. నాయకులు, రైతులు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహా యకులు పి. గీత మరియు జగదీష్ పాల్గొన్నారు.



గుడ్లూరు రూరల్లో..

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -వలేటివారిపాలెం

వలేటివారిపాలెంలోని ప్రభుత్వ కార్యాలయాల కాంప్లెక్స్‌వద్ద పొలాలకు వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాలకు తుప్పర్లు తీగలు దట్టంగా అలుముకుని విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానికులు చెబుతున్నారు. అది విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు. ఆ తీగలు వల్ల తరచూ విద్యుత్ షార్ట్ సర్క్యూ ట్ అవుతుందని చెబుతునా్రను. విద్యుత్ స్తంభానికి కూడ విద్యుత్ సరఫరా జరిగి పొలాల్లోకి వెళ్లే వారికి షాక్ కొడుతొందని రైతులు పేర్కొంటున్నారు. మూగజీవాలు కూడ విద్యుత్ ప్రమాదాలతో మత్యువాత పడే అవకాశాలు! ఉన్నాయని రైతులు చెబుతున్నారు. అయినప్పటికి సంభందిత అధికారులు పట్టిం చుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ సిబ్బంది స్పందించి విద్యుత్ స్తంభం చుట్టూ అల్లుకున్న తీగలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.



విద్యుత్ స్తంభం చుట్టూ అలముకున్న తీగలు

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు టిఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ప్రపంచ ధరిత్రి దినోత్సవాని పురస్కరించుకొని మంగళవారం మొక్కలు నాటారు. కళాశాలలో అలాగే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ఎన్ఎస్- ఎస్ యూనిట్ అద్వర్యం లో నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నాగూర్ వలి తెలిపారుఇంకా కళాశాల పౌర శాస్త్ర అధ్యాపకులు ఓ .వెంకటేశ్వర రావు మాట్లాడారు.



మొక్కలు నాటుతున్న దృశ్యం



ఎంఆర్‌పిఎస్ విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-కావలి

కావలి రూరల్ మండలం రాజువారి చింతలపాలెం గ్రామంలో మంగళవారం ఎం.ఆర్.పి.ఎస్. ఆధ్వర్యంలో ఎస్.సి. రిజర్వేషన్ అమలు విజయోత్సవ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అవమానాలు, బెదిరింపులు, వెన్నుపోట్లు, అన్నింటిని అధిగమించి జాతి కోసం 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో తన జీవితాన్ని జాతికి అంకితం చేసి, ఎస్.సి. రిజర్వేషన్ల ఫలాలు 59ఉపకులాలకు జనాభా దామాషా ప్రకారం సాధించిపెట్టిన అభినవ అంబేద్కర్ మహనీయుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా, మాదిగల లక్ష్యం నెరవేరేందుకు సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి.రాజేంద్ర, బి.మాల్యాద్రి, పి.అచ్చన్న, పి.మాల్యాద్రి, పి.మస్తానయ్య, బి.రమణయ్య, డి.శీనయ్య, పి.శ్రీరాములు, పి.అంకయ్య, బి.మాల్యాద్రి, జె.శీనయ్య, పి.మాధవ పాల్గొన్నారు.



భూమి, నీరు, గాలిని సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : సమాజంలో భూమి, నీరు, గాలిని సంరక్షించుకొని, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని కావలి లోక్ అదాలత్ సభ్యులు మాలకొండా రెడ్డి తెలిపారు. బోగోలు మండలం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల ఆవరణలో మంగళవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలకొండ రెడ్డి మాట్లాడుతూ జల కాలుష్యం, వాయు కాలుష్యం నివారించి సారవంతమైన భూమిని కాపాడుకొని, వృక్ష సంపదను పెంచుకొని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎన్ పద్మావతి మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకం నియంత్రించి గుడ్డ సంచులు, విస్తరాకులు ఎక్కువగా వినియోగించుకోవాలని కోరారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి మర్రిపాడు క్లస్టర్‌కు చెందిన రైతులు 663పొగాకు బేళ్ళను వేలం కేంద్రానికి తీసుకురాగా 463బేళ్ళను పలు కంపెనీ ప్రతినిధులు కొనుగోలు చేశారని వేలం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 185పొగాకు బేళ్లను తిరస్కరించారన్నారు. వాటిలో ఎన్‌బి 147ఎన్ ఎస్ 13ఆర్ఆర్ 13సిఆర్ 12కాగా అధిక బరువుతో ఉన్న 15బేళ్ళను వేళానికి తిరస్కరించారని తెలిపారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.220సగటు ధర రూ.262.69 నమోదు కాగా వేలంలో 11మంది కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిపారు.



పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి-కావలి : కావలి నియోజకవర్గంలో ధరిత్రి దినోత్సవం (ఎర్త్ డే) సందర్భంగా మంగళవారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమ ములో భాగంగా పెదపట్టపుపాలెం, అన్నగారిపాలెం, సి.ఆర్.పాలెం మొదలగు పట్టపుపాలెల్లో పంచాయతీల ప్రాంగణాలు, పాఠశాల ప్రాంగణాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని జనసేన పార్టీ మత్స్యకార కమిటీ చేపట్టారు. ముఖ్య అతిథిగా జనసేన పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ పాల్గొని మాట్లాడుతూ కార్యక్రమాన్ని డాక్టర్ తేజ సౌజన్యంతో, మత్స్యకార రాష్ట్ర కార్యదర్శి శ్రీను, మత్యకార అధ్యక్షులు డిఆర్.రవి పర్యవేక్షణలో, మత్స్యకార కమిటీ సభ్యుల సహకారంతో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సచివాలయ సెక్రటరీ సురేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొనందుకు వారికి అభినందనలు తెలిపారు. 1969లోనే ఐక్యరాజ్య సమితి పర్యావరణ పరిరక్షణ కోసం మొదలుపెడితే, ప్రపంచం అంతటా ఏప్రిల్ 22, 1970 నుండి ఎర్త్ డే (ధరిత్రి దినోత్సవం) వార్షిక కార్యక్రమంగా అప్పటి అమెరికా ప్రెసిడెంట్ కెన్నెడీ ప్రకటించి అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మత్స్యకార నాయకులు, పంచాయతీ అధ్యక్షులు, వీరమహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి ప్రదాతలకు సన్మానం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేసిన పూర్వ విద్యార్థులు, దాతలకు ఘనంగా సన్మానం జరిగింది. వివరాలమేరకు.. మండలంలోని ఈదూరు గ్రామం శ్రీ జలదంకి రామలింగారెడ్డి జి ల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు కల్పన, భవనాల మరమ్మతులు తదితర అభివృద్ధి కో సం ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు సాని శ్రీనివాసులు, తొలికొండ వెంక టేశ్వర్లు, సందు రవీంద్ర, గుండాల సుధాకర్ రెడ్డి, ఎల్లసిరి శీనయ్య, ఎ స్. ఎం. సి మాజీ చైర్మన్ పచ్చా మ ధు తదితరులు దాతల సహకారం తో తమ వంతు కృషి చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మం గళవారం పాఠశాలలో పూర్వ వి ద్యార్థులు, దాతలను ఘనంగా స న్మానించారు.



ట్రాఫిక్ కష్టాలు..

ప్రజాశక్తి బిట్రగుంట

బోగోలు పెద్ద బజారు, ఇబ్రహీంపేట చిన్న బజార్ సెంటర్ వద్ద దుకాణదారులు వారికి కేటాయించిన స్థలం హద్దులను దాటి రోడ్ల పైకి వచ్చి ఉన్నాయని, వాహనాలు ఇష్టానుసారంగా పెడుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, ప్రజలు వాపోతున్నారు. దుకాణదారులు వారికి కేటాయించిన స్థలంలో వ్యాపారాలు సాగిస్తే ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉంటుందని, ప్రజలు కోరుతున్నారు. ఇటీవల కురిసిన గాలివానకు బోగోల్ బజార్ సెంటర్‌లో ఉన్న చెట్టు రోడ్డు వైపునకు వాలిపోవడంతో లోడుతో వస్తున్న లారీలు, ట్రాక్టర్లకు ఇబ్బందికరంగా మారిందని, అధికారులు స్పందించి ఆ చెట్టు కొమ్మను తొలగించిన ఎడల వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు ఉండవని ప్రజలు వాపోతున్నారు. మైనర్ పిల్లలు బైక్‌లపై ఇష్టానుసారంగా అతివేగంగా డ్రైవింగ్ చేస్తున్నారు. ఇటీవల ఇబ్రహీంపేట సెంటర్లో మైనర్ బాలుడు అతివేగంగా వచ్చి పాద చారుల పై రావడంతో మేజర్ యాక్సిడెంట్ జరిగిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంపూర్ణ అక్షరాస్యత తప్పక సాధిస్తాం..

ప్రజాశక్తి-కోవూరు

స్థానిక ఐసిడిఎస్ కేంద్రంలో నియోజక వర్గ అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ మొబిలైజర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఓ ఆనంద్, ఇతర అధికారులతో కలిసి ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గం చైతన్యవంతమైనదని, గతంలో చేపట్టిన కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు విజయవంతంగా జరిగాయని తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలో గుర్తించిన నిరక్ష రాస్యులను అక్షరాస్యులుగా మార్చే కార్యక్రమం విజయవంతం అవుతుందని తెలిపారు. అందుకు కావాల్సిన సహాయ సహకారాలు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తమ వి పి ఆర్ ట్రస్ట్ ద్వారా సంపూర్ణంగా అందిస్తామని తెలిపారు. క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి తెలియనివారు ఎంతోమంది ఉన్నారని వారికి ఆయా పథకాల గురించి కనీస అవగాహన ఉండాలంటే అక్షరాస్యత తప్పనిసరన్నారు. నియోజకవర్గంలోని 82 పంచాయతీల్లోని గ్రామాల అభివృద్ధి స్థానిక నాయకులు, ప్రజలు చేతుల్లోనే ఉంటుందని తమ విశ్వాసమన్నారు. స్థానిక అవసరాలను గుర్తించి పరిష్కారం కోసం కృషి చేసిన వారే నాయకులు అవుతారన్నారు. అక్షరాస్యత కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని 138 హామ్లెట్స్ లో జరిగే విధంగా తీర్చిదిద్దార న్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారాల న్నారు. ముఖ్యంగా నిరక్షరాస్యులైన మహి ళలు ఈ అవకాశాన్ని చక్కగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంపూర్ణ అక్షరాస్యత సాధించే క్రమంలో కమ్యూనిటీ మొబిలైజర్స్ తమ వంతు పాత్ర పోషించాలన్నారు. మనకు తెలిసిన విద్యను ఇతరులకు పంచడంలో ఆనందం ఉంటుందన్నారు. దానివల్ల పోయేదేమీ ఉండదని పదిమందికి సహాయం చేశామనే ఆత్మసంతృప్తి కలుగు తుందన్నారు. అందరూ ఒక తాటిపై నడిచి అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రజలు మెచ్చేలా ప్రతి కార్యక్రమానికి ఈ ప్రాంత ఎంపి, ఎంఎల్ఏ లుగా ముందుంటామన్నారు.

కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో అక్షరాస్యత శాతం పెంచే కృషిలో భాగంగా నియోజకవర్గం యూనిట్‌గా నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దే క్రమంలో స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చొరవతో కోవూరు నియోజకవర్గంను ఎంపిక చేశామన్నారు. ఇందులో మొత్తం 22000 మంది నిరక్షరాస్యులను గుర్తించామని, వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దటమే కాకుండా, ఎంపిక చేసిన వారికి నరేగా పనుల్లో మస్టర్ వేసే విధానం, బ్యాంకింగ్ కార్యకలాపాలు, తదితర ప్రభుత్వ కార్యక్రమాల విధి విధానాలు, అమలు గురించి అవగాహన కల్పిస్తామన్నారు. ఇందుకోసం 2500 మంది స్వచ్ఛంద ఉపాధ్యాయులను నియమించామ న్నారు. ఈ కార్యక్రమంలో వయోజనవిద్య డిడి మహ్మద్ ఆజాద్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జెడ్‌పి సిఇఒ విద్యారాణి, డ్వామా పీడీ గంగాభవాని, డిఇఒ బాలాజీ రావు, డిఆర్‌డిఎ పీడీ నాగరాజ కుమారి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ర్యాలీ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-బిట్రగుంట

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా 24న బోగోలు సెంటర్ నుండి ఇబ్రహీంపేట జామియా మసీదు వరకు శాంతియుత నిరసన ర్యాలీకి ప్రతి ముస్లిం సోదర, సోదరీమణులందరూ ప్రజాస్వామ్య వాదులు, అంబేద్కర్ వాదులు, లౌకికవాదులు, వామపక్ష పార్టీలు, అందరూ పాల్గొని ఈ ర్యాలీని విజయవంతం చేయాలని ముస్లిం మైనారిటీ జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా షేక్ నూరుద్దీన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును, నిరసనగా ఈ నల్ల చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకునేంతవరకు తమ నిరసన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ప్రతి ముస్లిం సోదర సోదరీమణులు, యువకులు విద్యావంతులు, వ్యాపారస్తులు ప్రతిఒక్కరు కార్యక్రమానికి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం జేఏసీ నాయకులు షేక్.సిరాజ్, మహబూబ్ బాషా, షేక్ గౌస్‌బాషా, అష్రఫ్ భాషా, జాఫర్, సయ్యద్ కలీమ్, హబ్బు, షేక్ జిలాని, సయ్యద్ సుభాని, నజీర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

నేడు 'పది' ఫలితాలు

ప్రజాశక్తి- సీతారామపురం

మార్చిలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు, ఓపెన్ స్కూల్ 10వ తరగతి ఫలితాలను బుధవారం విడుదల చేయనున్నట్లు మంగళవారం ఎంఇఒ ప్రకటన ద్వారా తెలిపారు. ఉదయం 10 గంటలకు https-apopenschool ap govt.in వెబ్‌సైట్లలో పాటు మనమిత్ర వాట్సప్ యాప్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు వాట్సాప్‌లో 9552300009 అను నెంబరు "హాయ్" అని మెసేజ్ పంపి, విద్యార్థి సేవలను ఎంచుకొని ఆపై ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలు ఎంచుకొని విద్యార్థి హాల్ టికెట్ నెంబర్‌ను నమోదు చేసి ఫలితాలను పొందవచ్చన్నారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాల లాగిన్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చని సూచించారు. మొబైల్ యాప్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు లాగిన్ ద్వారా కూడా ఫలితాలను పొందే సౌలభ్యం ఉందన్నారు.


మాట్లాడుతున్న ఎఎస్‌పి సౌజన్య

పోలీసులకు అభినందనలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

వ్యవసాయ విద్యుత్ మోటార్ల చోరీలపై ప్రత్యేక నిఘా పె ట్టి చోరీ సొత్తు రికవరీ చేయడంతో ప్రతిభను ప్రద ర్శించ డమే కాకుండా దొంగలను అరెస్ట్ చేసే విషయంలో అ త్యంత చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను శభాష్ పోలీస్" అంటూ జిల్లా అడిషనల్ ఎస్‌పి సౌజన్య అభి నందించారు. వివరాల్లోకి వెళితే...ఇటీవల జిల్లాలో ని పలు ప్రాంతాలలో పొలాల్లోని వ్యవసాయ విద్యుత్ మోటార్ల చోరీకి గురయ్యాయి. ఈ నేపథ్యంలో మోటార్ల చోరీలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్‌పి జి. కృష్ణ కాంత్ ఆదేశాలు జారీ చేశారు. దాంతో అడిషనల్ ఎస్‌పి సౌజన్య, నెల్లూరు రూరల్ డిఎస్‌పి జి. శ్రీనివాసరావుల ప ర్యవేక్షణలో విద్యుత్ మోటార్ల దొంగతనాలపై ప్రత్యే క నిఘా పెట్టారు. ఈ క్రమంలో తోటపల్లిగూడూరు, ము త్తుకూరు, వెంకటాచలం, నెల్లూరు రూరల్ మండలాల పరిధిలో చోరీకి గురైన 25 వ్యవసాయ విద్యుత్ మోటా ర్లు, రూ. 35 వేల విలువ కలిగిన ఇనుప పైపులతో కలి పి మొత్తం రూ. 5.05 లక్షల విలువైన చోరీ సొత్తు, ఏపీ 26 వై 5110 ఆటోను రికవరీ చేశారు. సొత్తుతో పాటు చోరీకి పాల్పడిన కొడవలూరు మండలం నార్తురాజు పాలెం గ్రామానికి చెందిన నిందితులు కత్తుల బాబీ, పొ ట్లూరు పూర్ణ చంద్రారావు, చౌటూరు శ్రీనులను అరెస్ట్ చేశారు.

26న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- సీతారామపురం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 26వ తేదీ ఉదయం 10:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ భాస్కరరావు మంగళవారం తెలిపారు. ఎంపిపి చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన జరిగే సమావేశంలో మండల అభివృద్ధిపై సమీక్షించినట్లు తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

'ఉపాధి'లో సౌకర్యాలు నిల్..

- అధికారుల నిర్లక్ష్యంతో కూలీలకు ఇబ్బందులు

ప్రజాశక్తి వరికుంటపాడు

ప్రజలకు ఆహార భద్రత కల్పించడంలో భాగంగా గ్రామీణ ప్రాంతాలలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో ఉంది. పూర్తిగా కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు జరుగుతున్న ఈ పథకంలో కూలీలకు కల్పించాల్సిన కనీస వసతులు కల్పించకపోవడంలో స్థానిక అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. వరికుంటపాడు మండలంలో 7844 మంది కూలీలు ఉండగా 2855మంది ప్రస్తుతం పని చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనిచేసే ప్రదేశంలో చల్లటి తాగునీరు అందుబాటులో ఉంచాలి. వారికేదైనా ప్రమాదం జరిగితే అత్యవసర చికిత్స అందించేందుకు ఫస్ట్ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచుకోవాలి. అంతేకాకుండా వేసవి తీవ్రత వల్ల ఎవరైనా వడదెబ్బకు గురైన సంరక్షణ కల్పించేందుకు లేదా పసిపిల్లల తల్లులు ఎవరైనా ఉంటే ఒక పది నిమిషాలు విశ్రాంతి తీసుకునేందుకు టెన్ట్ ఏర్పాటు చేయాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి. ఇవేమీ లేకుండా కూలీల సంక్షేమం కూలీల రక్షణను గాలి వదిలేసి.. కేవలం పని జరిపామా.. లేదా.. అన్నచందంగా అధికారులు పనులు కొనసాగిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకల ప్రకారం మండల కేంద్రాల్లో ఉపాధి హామీ పనులు జరగటడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా కల్పించాల్సిన కనీస అవసరాలపై దృష్టి సారించడం లేదని కూలీలు అంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వరికుంటపాడు మండలమే కాకుండా మిగతా మండలాల్లో కూడా కూలీలకు అందే సౌకర్యాల పట్ల దృష్టి సారించాలని కోరుతున్నారు.



ముగిసిన 'పోషణ్ పక్వాడ'

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ్ పక్వాడ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ అనంతసాగరం ప్రాజెక్ట్ సూపర్వైజర్ నాగమణి మాట్లాడుతూ మంగళవారంతో పోషణ పక్వవాడ వారోత్సవాలు ముగిశాయన్నారు. ఈ వారం రోజులు ఐసిడిఎస్ అనంతసాగరం ప్రాజెక్ట్‌లోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వవాడ వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహించామన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలో పోషక ఆహార పదార్థాల గురించి అవగాహన కల్పించడమే పోషణ్ పక్వాడ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. గర్భిణులు తక్కువ ఖర్చులో అందుబాటులో ఉన్న పోషక ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. పాలు, గుడ్డు, ఆకు కూరలు లాంటి ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడని, అలాగే గర్భిణులకు రక్తహీనత లేకుండా ఆరోగ్యంగా ఉంటారు అని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ జ్యోతి, లక్ష్మి, యనదమ్మ, రత్తమ్మ, ఆయాలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

ప్రజాశక్తి-కోవూరు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన మెరుగైనవిద్యను అందిస్తున్నారని, ఈ పాఠశాల లను విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని డిఇఒ బాలాజీరావు అన్నారు. కోవూరులోని పెళ్లకూరు కాలనీలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మంచి శిక్షణ పొంది ఉన్నత చదువులు చదివిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులకు బోధన అందిస్తున్నారన్నారు. అదేవిధంగా క్రీడా మైదానాలు ఉన్నాయని, ఈ కారణంగా విద్యార్థుల్లో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం కూడా ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి ప్రభుత్వం ద్వారా విద్యాపరమైన వస్తువులు ఇవ్వడం ద్వారా డొక్కా సీతమ్మ పథకం కింద విద్యార్థులకు మంచి పౌష్టికాహారం కూడా అందిస్తున్నారన్నారు. ఇన్ని సదుపాయాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గీతాంజలి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కోవూరు

బెంగుళూరులోని నార్త్ యూనివర్సిటీలో నిర్వహించి పెన్నాకిసిలాడ్ జాతీయ స్థాయి అంతర్ విశ్వ విద్యాలయ పోటీలో తమ కళాశాల ఈఈఈ ఇంజినీరింగ్ విద్యార్థి జేవీ సుజిత్ ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించి తమ కళాశాల పేరు ప్రతిష్ లను మరింత ఇనుమడింపజేశారని ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని గంగవరం గ్రామంలోని గీతాంజలి కళాశాలలో మంగళవారం విద్యార్థికి అభినందన సభ నిర్వ హించారు. ఈ సందర్భంగా కళాశాల అడ్మిషన్ డీన్ డాక్టర్ కుమార్ మాట్లాడుతూ బెంగుళూరు నార్త్ యూనివర్సిటీలో నిర్వహించి ఈ జాతీయ స్థాయి పోటీల్లో తమ కళాశాల విద్యార్థి అత్యంత ప్రతిభకనబరిచారన్నారు. అభినందన కార్యక్రమం లో కళాశాల ఈఈఈ విభాగాధపతి డాక్టర్ టి. రవికుమార్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అశోక్ కుమార్, తదితరులు ఉన్నారు.

కేన్సర్ నివారణపై అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ సి హరిత

ప్రజాశక్తి-కావలి

కావలిలో డాక్టర్ ప్రభాకర్ నాయుడు ప్రజా వైద్యశాల డాక్టర్ ప్రభాకర్ నాయుడు సహకారంతో వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు షేక్. బాషా ఆధ్వర్యంలో నెల్లూరు అపోలో హాస్పిటల్స్ వారి సౌజన్యంతో మంగళవారం డాక్టర్ సి.హరిత, సీనియర్ అంకాల జిస్ట్, హెమటాల జిస్ట్, జి.వి.వి. ప్రసాద్ రెడ్డి, ప్రముఖ క్యాన్సర్ శస్త్ర చికిత్స వైద్య నిపుణులు నేతృత్వంలో కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రశంగిస్తూ దగ్గు, చెస్ట్ పెయిన్, ఊపిరాడక పోవడం, బ్లోటింగ్, బ్లీడింగ్, గడ్డలు, కడుపు నొప్పి, వెన్నునొప్పి, సడన్గ బరువు తగ్గడం, మలవిసర్జనలో మార్పులు, పుట్టుమచ్చలో మార్పులు, రక్తంలో మార్పులు కేన్సర్ వల్ల ఈ విధంగా ఎన్నో మార్పులు వస్తాయన్నారు. ముఖ్యంగా జీవనశైలిలో మార్పులు, స్థూలకాయం, పొగతాగడం, మద్యం సేవించడం, వల్ల కూడా గొంతు కేన్సర్ వచ్చే ప్రమాదముందన్నారు. ఎటువంటి అనుమానం కలిగిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రస్తుతం కేన్సర్‌కు హెపటైజ్ వ్యాక్సిన్ వచ్చింది ముఖ్యంగా ఆహారపు అలవాట్లు మారాలన్నారు. ఏ చిన్న సమస్యవచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కేన్సర్ అనేది దీర్ఘకాల వ్యాధి స్క్రీన్ టెస్ట్ చేయించుకొని అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, కేన్సర్ వ్యాధి వలన భయపడాల్సిన పని లేదని అన్నివిధాల వైద్యం అందుబాటులో ఉందని సూచనలు సలహాలు ఇచ్చారు. స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు షేక్.బాషా, ఎం.వి.ఎస్.ప్రసాద్ రావు, ఎం.అజిత్ బాబు, మొఘల్ సలీం బేగ్, ఆర్. దిలీప్ కుమార్, బి.శారద, దామ మధుసూదన్ రావ్, సయ్యద్ ఘని బాషా, వరప్రసాద్, షేక్ జమీర్, షేక్.రఫీ అహమ్మద్, సి హెచ్. ప్రభయ్య, ఆర్.బాబ్జి, పి.ఆర్.ఒ.లు మాధవరావ్, ఆనంద్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

చెరకు రైతుల సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

కోవూరు సుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో ఈనెల 24వ తేదీ జరగనున్న చెరకు రైతుల సదస్సును జయప్రదం చేయాలంటూ ఆసంఘం జిల్లా కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. బుచ్చిరెడ్డిపాలెం మండలం, కాగులపాడు పంచాయతీ శ్రీరంగ రాజపురంలో 24వ తేదీ ఉదయం 10 గంటలకు సుగర్ ఫ్యాక్టరీ ఆవరణంలో శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి వద్ద జరగనున్న చెరకు రైతుల సదస్సు కోసం సిపిఎం నాయకులు ఆధ్వర్యంలో ప్రచార జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా గండవరపు శ్రీనివాసులు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. అదేవిధంగా కార్మికుల బకాయిలను వెంటనే చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు. కోవూరు కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీని సహకార రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. చెరకు రైతుల సదస్సు కార్యక్రమంలో మండలంలోని రైతులందరూ పాల్గొనాలన్నారు.కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చెరకు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు బిళ్లా రఘురామయ్య, రైతు సంఘం నాయకులు పుత్తేటి మల్లికార్జున, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.




ప్రచారం నిర్వహిస్తున్న రైతులు




సీనియర్ సివిల్ జడ్జికి సత్కారం

ప్రజాశక్తి-కావలి : కావలి నుండి కందుకూరు కోర్టుకు బదిలీపై వెళు తున్న సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎం.శోభను మంగళవారం వారి ఛాంబర్లో మాజీ ఎ.జి.పి. పొట్లూరు శ్రీనివాసులు, కొందరు న్యాయవాదులు కలిసి, శాలువా కప్పి, పూల బొకే అందజేసి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పొట్లూరు శ్రీనివాసులు మాట్లాడుతూ, శోభ కావలిలో పనిచేసిన 3యేళ్లలో క్లిష్టమైన అనేక కేసులలో మంచి తీర్పులు ఇచ్చారన్నారు. మండల న్యాయ సేవధికార సంస్థ చైర్మన్‌గా మంచి సేవలు అందించి, అనేకమంది పేదలకు న్యాయం కలుగజేశారని తెలిపారు. కార్యక్రమంలో పొట్లూరు శ్రీనివాసులు వెంట న్యాయవాదులు రాఘవరావు, కోమలి, పవన్, జోసెఫ్, అలేఖ్య, మసుధా, సిబ్బంది విజయకుమార్, ప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన



ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలం లోని చిరమన, శ్రీకొలను గ్రామ పంచా యతీల్లోని రైతు భరోసా కేంద్రాలలో మండల వ్యవసాయ అధికారిని టి.రజిని ఆధ్వర్యంలో ఖరీఫ్‌లో ప్రత్యా మ్నాయ పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరికి బదులుగా మినుము, పెసర, మొక్క జొన్న అలసంద, పంటలు వేసుకోవాల న్నారు. తద్వారా పంటలలో వచ్చి తెగుళ్లు, పురుగులను సులువుగా, అదుపు చేయడానికి వీలవుతుందని తెలియజేశారు. మట్టి నమూనాలను సేకరించే విధానాన్ని, మట్టి పరీక్షల ఉపయోగాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎఇఒ కె.చిరంజీవి, విఎఎ కె.తులసి, విహెచ్ఎ జె.సంధ్యారాణి, రైతులు, పాల్గొన్నారు.



ప్రజాశక్తి-విడవలూరు : రైతులు మట్టి పరీక్షలు చేయించుకోవాలని మండల పరిధిలోని వావిళ్ల, దంపూర్ గ్రామాలలో సోమవారం వ్యవసాయ అధికారి వెంకట కృష్ణయ్య రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా పొలాల్లోని మట్టిని పరీక్షించి మట్టికి తగ్గట్టుగా ఎరువులను వాడుకోవాలని సార్వంతమైన మట్టితో అధిక దిగుబడి పంటలను పండించుకోవచ్చని అన్నారు.



ప్రజాశక్తి-కొడవలూరు : మండలంలోని రామన్నపాలెం, ఆలూరుపాడు పంచాయతీలోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు మంగళవారం మట్టి నమూనాపై అవగాహన కార్యక్రమం ఎఒ సిహెచ్ఎస్ లక్ష్మి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 1120 మట్టి నమూనా స్వీకరించాల అనే లక్ష్యంతో సచివాలయ అగ్రికల్చర్ సిబ్బంది పనిచేయాలన్నారు. ఒక్కో సచివాలయానికి 80మట్టి నమూనాలను లక్ష్యంగా ఇవ్వడం జరిగిందన్నారు. మట్టి నమూనా వల్ల రైతులు తమ పొలంలోని పోషక విలువలను తెలుసుకోవచ్చని ఆమె తెలిపారు. దాని ద్వారా పంట ఖర్చును తగ్గించుకోవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది వెంకట్రావు, నిహారిక, పృథ్వీ పాల్గొన్నారు.